

### గత పదేండ్లలో కరెంటుకు ఢోకా లేకుండె

ఎల్కతుర్తి: తెలంగాణ రాకముందు రాత్రి, పగలు తేడా లేకుండా కరంటు కోతలుండేవి. రాత్రిళ్లు బావుల కాడికి పోయి చేన్లకు నీళ్లు పారిచ్చేటోళ్లం. పంటలు ఎండిపోతుంటే ధర్నాలు కూడా చేసినం. రాష్ట్రం వచ్చినంక ఆ పరిస్థితి లేదు. కేసీఆర్ 24గంటల కరంటు ఇస్తానని చెప్పినట్లుగానే ఇచ్చిండు. మన దగ్గర సరిపోయేంత కరంటు లేకపోతే వేరే రాష్ట్రాల నుంచి కొని ఇచ్చిండు. దాంతో పొద్దుందాకనే చేన్లకు నీళ్లు పారిచ్చుకున్నం. గీ పదేండ్లలో ఏ రోజు కూడా రాత్రి బాయి కాడికి పోయి నీళ్లు పెట్టలే. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు రాని కరెంటు తెలంగాణ వచ్చినంకనే సరిపోయేంత వచ్చింది. ఇన్ని రోజులు కరంటు రాక పంటలు ఎండిపోయిన ఘటనలు అయితే లేవు. గత పదేండ్లలో కరెంటుకు, నీళ్లకు ఢోకా లేకుండ పంటలు పండించుకున్నం.

– మామిడి తిరుపతిరెడ్డి, రైతు, ఎల్కతుర్తి



### రైతులు కేసీఆర్‌ను మరిచిపోరు

కాజీపేట: 2014కు ముందు అస్తవ్యస్తంగా ఉన్న కరెంట్ సరఫరాను గాడిన పెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే చెందుతది. రాత్రి వేళల్లో త్రీ ఫేస్ కరెంట్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని ఉదయం వేళల్లో సరఫరా చేసి మర్చిపోలేని సాయం చేసిండు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న విధానాలతో అన్నదాతలు విష పురుగుల బారిన పడడం, విద్యుత్ షాక్‌ల వంటి ప్రమాదాలు నిలిచిపోయాయి. రైతులు ఆయనను మరిచిపోరు. మంచి చేసిన కేసీఆర్‌పై నిందలు వేయడం తగదు. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ గత కాంగ్రెస్ పాలనే గుర్తుకు తెస్తున్నది.


– సుంచు అశోక్ కుమార్, రైతు, సోమిడి

# పదేండ్లల్లి పవర్‌ఫుల్

- 2014కు ముందు అరకొర విద్యుతే
- అప్పట్ల ఎవుసానికి ఆరేడు గంటల కరెంటే
- లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయేవి
- అస్తవ్యస్తంగా ఉన్న కరెంట్‌ను గాడిన పెట్టింది కేసీఆరే
- ఆయనపై నిందలు వేయడం సరికాదు
- రైతులు, మోటర్ మెకానిక్ తదితరుల మనోగతం

**‘రాష్ట్రం వచ్చినప్పటి నుంచి పదేళ్ల కాలంలో కరెంట్‌కు ఢోకా లేదు. 2014కు ముందు అరకొర విద్యుత్‌తో ప్రజలు చాలా కష్టాలు పడ్డరు. అప్పటి ప్రభుత్వం ఎవుసానికి ఆరేడు గంటల కరెంటే ఇచ్చేది. లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయేటివి. రాత్రి వేళల్లో త్రీ ఫేస్ కరెంట్ తీసేటోళ్లు. విష పురుగుల బారిన పడి, విద్యుత్ షాక్‌ల వంటి ప్రమాదాలతో ఎంతో మంది రైతుల ప్రాణాలు పోయినయ్. కరెంట్ లేకపోవడంతో ఎలక్ట్రీషియన్లు, పిండి గిర్నీ నిర్వాహకులకు పనిలేక ఖాళీగా కూర్చునేటోళ్లు. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ గత కాంగ్రెస్ పాలనే గుర్తుకు తెస్తున్నది. అస్తవ్యస్తంగా ఉన్న కరెంట్‌ను గాడిన పెట్టింది కేసీఆరే. మంచి చేసిన ఆయనపై నిందలు వేయడం తగదు. కరెంటు విషయంలో తప్పు పట్టాల్సిందేమీ లేదు’ అని రైతులు, మోటర్ మెకానిక్ తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.**

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 21**



### గతంల కాంగ్రెస్ ఏడు గంటల కరెంటే ఇచ్చింది



మహబూబాబాద్ రూరల్: రాష్ట్రం ఏర్పడక ముందు సరైన కరెంట్ లేక అనేక ఇబ్బందులు పడ్డం. గతంల కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు గంటల కరెంట్ మాత్రమే ఇచ్చింది. రాత్రి పగలు అనే తేడా లేకుండా బావి కాడకు పోయేది. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి సమస్యలు ఉండొద్దని 24 గంటల కరెంట్ ఇచ్చింది. అది కూడా రెండు పంటలకు ఉచితంగ. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసింది. గత యాసంగిలో సరైన కరెంట్ లేక పంటలు మొత్తం ఎండిపాయె. నిరంతరం కరెంట్ ఇచ్చిన కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైంది కాదు.

– బానోతు నవీన్ నాయక్, రైతు, దామ్యతండా, మహబూబాబాద్



### కరెంట్ గురించి ఆలోచనే ఎక్కువ ఉండేది



చెన్నారావుపేట: 16 ఏళ్లుగా పిండి గిర్ని షాపు నడుపుతున్న. రాష్ట్రం రాక ముందు కరెంట్ కోసం ఉద్యమాలు చేయాల్సి వచ్చేది. ఊర్లో కరెంట్ ఎప్పుడొస్తుందో అని వేయి కళ్లతో ఎదురుచూసే వాళ్లం. రోజులో 3 లేదా 4 గంటల కరెంట్‌తో పిండి గిర్ని నడపడానికి నానా తంటాలు పడేది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 6 నెలల్లో కరెంట్ వ్యవస్థలో తీవ్ర మార్పు వచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వడంతో పాటు 24 గంటలు అందించి కోతలు లేకుండా చేసింది. ఆయన కరెంట్ ఎక్కడి నుంచి తెచ్చిండని ఎవరూ ఆలోచించలే. పని చేసుకొని బతకడానికి కరెంట్ ఉందా లేదా అనేదే చూశారు. కరెంట్ కొనుగోళ్లలో కోట్లు తిన్నాడనేది పచ్చి అబద్ధం. అదే జరిగితే 24 గంటల కరెంట్ ఎలా సాధ్యమైంది.

–పాషా, పిండి గిర్ని నిర్వాహకుడు, చెన్నారావుపేట

### కేసీఆర్ రాక ముందు వేరేగా ఉండె



శాయంపేట: కేసీఆర్ రాక ముందు పరిస్థితి వేరేగా ఉండే. నాకు రోజుకు ఆరేడు మోటర్లు రిపేర్లు వచ్చేవి. రాత్రంతా కూర్చుని చేసేవాళ్లం. కేసీఆర్ వచ్చినంక 24 గంటల విద్యుత్‌ను మంచిగా ఇవ్వడంతో మోటర్లు కాలిపోవడం బందైంది. నిజంగా చెప్పాలంటే పదేళ్లు కరెంటు మోటర్లు రిపేరుకు రావడం పూర్తిగా తగ్గింది. రాత్రిళ్లు పొలాలకు రైతులు వెళ్లడం తగ్గింది. కరెంటు విషయంలో కేసీఆర్‌ను తప్పు పట్టాల్సిందేమీ లేదు.

– బోనాల రమేశ్, మోటర్ వైండింగ్ మెకానిక్, శాయంపేట

### ఉమ్మడి రాష్ట్రంలో అరకొర విద్యుత్



పరకాల: ఉమ్మడి రాష్ట్రంలో అరకొర విద్యుత్‌తో రైతులు తీవ్ర కష్టాలు పడ్డరు. అప్పటి ప్రభుత్వం ఎవుసానికి ఆరేడు గంటల కరెంటే ఇచ్చేది. అది రాంగనే రైతులందరూ ఒకేసారి మోటర్లు ఆన్ చేసేవారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడి లోవోల్టేజీ సమస్య వచ్చేది. దీంతో మోటర్లు కాలిపోయేవి. ఏడాదికి రెండు మూడు సార్లు కూడా కాలినయ్. కేసీఆర్ సీఎం అయిన తర్వాత 24 గంటల కరెంటు రావడంతో మోటర్లు కాలుడు తగ్గినయ్.

– పల్లెబోయిన రాజు, రైతు, లక్ష్మీపురం, పరకాల మండలం

### కంటి మీద కునుకు లేకపోతుండె



నల్లబెల్లి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కరెంట్ కోసం పడ్డ కట్టం పగోడికి కూడా రావొద్దు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడ్తే సమయ పాలన లేని కరెంట్ సరఫరాతో పంటలకు నీరు పెట్టలేక గోస పడ్డం. భార్యతో కలిసి రాత్రి వేళ పంట చేనుల కాడికి పోయేది. కొంతమంది రైతులు పురుగు బూసి కాటేసి చనిపోయిన దుస్థితి ఉండె. అయినా సరే చేసిన అప్పులు తీర్చాలని రాత్రంతా పొలాల కాడ్నే గడిపేది. అచ్చిరాని కరెంట్‌తో దొయ్య పారక పోతుండె. కరెంట్ మోటర్లు మాటిమాటికి కాలుతుండె. మోటర్లు అల్లియ్యాలంటె అప్పు కోసం సావుకారి వద్దకు ఉరుకుతుంటిమి. విత్తనాలు, పిండి బత్తాల కోసం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల కాడ ఎండలో లైన్లు కడుతుంటిమి. అయినా ఒక్క పిండి బత్త దొరుకుడు గగ్గలమె. ఇన్ని కట్టాలు పడ్డా కూడా ఆశించిన దిగుబడి రాకపోతుండె. రైతుల గోసను తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, బీజేపోళ్లు పట్టించుకోలె. కేసీఆర్ సార్ కడుపు సల్లగుండ.. తెలంగాణ వచ్చినంక మాకు గోదావరి నీళ్లిచ్చిండు, 24 గంటల కరెంట్, నాణ్యమైన విత్తనాలు, అదునుకు పిండి బత్తాలు ఇచ్చిండు. పెట్టుబడి సాయంగా రైతుబంధు, రైతు చచ్చిపోతె రూ. 5 లచ్చల బీమా ఇచ్చి ఆదుకుండు. ఇలాంటి పెద్ద సార్‌పై నేడు కాంగ్రెస్ సర్కారు కుటిల ఆరోపణలు చేయడం సిగ్గుచేటు.

– ఇంతల అనంతరెడ్డి, రైతు, పంతులుపల్లె, నల్లబెల్లి

## ఎంజీఎంలో మళ్లీ కరెంట్ కట్



విద్యుత్ అంతరాయంతో ఎక్స్‌రే కోసం వేచి చూస్తున్న రోగులు

- ఎంజీఎంలో రెండు గంటలపాటు నిలిచిన ఎక్స్‌రే, రక్త పరీక్షలు
- ఇబ్బందులు పడిన రోగులు, అటెండెంట్లు

కాశీబుగ్గ, జూన్ 21: వరంగల్ ఎంజీఎం దవాఖానలో మళ్లీ కరెంట్ అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులు, అటెండెంట్లు, వైద్యులు ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జనరల్ ఓపీ, క్యాజువాలిటీ వార్డుల్లో ఎక్స్‌రే, స్కానింగ్, రక్త పరీక్షలు ఆలస్యమయ్యాయి. దీంతో రోగులు ఆరుబయట చాలా సమయం వేచి ఉన్నారు. మధ్యమధ్యలో చాలా సార్లు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుండడంతో కరెంట్‌తో చేసే సేవలు నిలిచిపోతున్నాయని దవాఖాన సిబ్బంది వాపోయారు. దవాఖానకు వచ్చిన రోగుల వైద్య పరీక్షలు, ఇతర రిపోర్ట్స్ అందక నిరాశతో మరుసటి రోజు వచ్చేందుకు వెనుదిరిగారు.



జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్

## ప్రొఫె‘సర్’ యాదిలో..

తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్‌సార్ వర్ధంతిని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వరాష్ట్ర సాధనలో దిక్సూచిగా నిలిచి, ఉద్యమంలో కోట్లాది మందిని కార్యోన్ముఖులను చేసిన మహనీయుడని ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యంగా పోరాడాలని పలువురు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని జయశంకర్‌సార్ స్మృతి వనం(ఏకశిల పార్కు)లోని నిర్వహించిన 13వ వర్ధంతి కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని నినాదాలు చేశారు. ఆయాచోట్ల ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– నమస్తే నెట్‌వర్క్, జూన్ 21

### ‘సార్’ అంటే ఇంత నిర్లక్ష్యమా?

- విగ్రహం రంగు పోతున్నా పట్టించుకోరా
- పాలకులు, అధికారులపై పలువురి ఆగ్రహం



హనుమకొండ: తలపై రంగు ఎగిరిపోయి, కళ తప్పిన ఈ విగ్రహం హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్మృతివనంలోనిది. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వచ్చిన ప్రజలు, నాయకులు విగ్రహం దుస్థితిని చూసి ఆగ్రహానికి లోనయ్యారు. విగ్రహంపై రంగు పోయినా పాలకులు, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా విగ్రహానికి మరమ్మతులు, రంగు వేయాలని కోరారు.

## ఉచిత విద్యుత్ మాకు వర్తించదా?

- అధికారుల తప్పిదంతో అన్యాయం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 21: 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని తమకు వర్తింపజేయాలని మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం పలువురు బాధితులు అధికారులను వేడుకున్నారు. మండలంలోని సోమ్లాతండాకు చెందిన బదావత్ విజయ, మాధవాపురానికి చెందిన లింగంపల్లి ఎల్లమ్మ, రామగిరి కవిత, వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెంకన్న మాట్లాడుతూ ప్రతిరోజూ మండల ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్, ఆధార్ కార్డ్, విద్యుత్ బిల్లు నంబర్, గ్యాస్ నంబర్ వివరాలను ప్రజాపాలన దరఖాస్తులో నింపి అధికారులకు ఇచ్చామన్నారు. అయినా నాలుగు నెలల నుంచి తమకు జీరో బిల్లు రావడం లేదన్నారు. తమ దరఖాస్తును కంప్యూటర్‌లో సరిగ్గా నమోదు చేయకపోవడంతో జీరో బిల్లు రావడం లేదని, అధికారుల తప్పిదంతో తాము బలవుతున్నామన్నారు. ఇప్పుడు అడిగితే తప్పులను సరిచేసే ఆప్షన్ తమ దగ్గర లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



జీరో బిల్లు రావటం లేదని కార్యాలయం ప్రజాపాలన దరఖాస్తులు చూపుతున్న బాధితులు

## డిమాండ్లు నెరవేర్చాలని జూడాల నిరసన

- కేఎంసీలో నలుపు రంగు దుస్తులు ధరించి తరగతులకు హాజరు
- ఎంజీఎంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం
- 24 నుంచి విధుల బహిష్కరణ, నిరవధిక సమ్మె



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

కాశీబుగ్గ, జూన్ 21: తమ డిమాండ్లను పరిష్కరించాలని కేఎంసీ జూనియర్ డాక్టర్లు శుక్రవారం నలుపురంగు దుస్తులు ధరించి తరగతులకు హాజరయ్యారు. అనంతరం ఎంజీఎం దవాఖాన ఆవరణలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దవాఖానకు వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలంటే తప్పనిసరిగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. నెలనెలా ఉపకార వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని, దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలల్లో సరిపడా బోధన, బోధనేతర సిబ్బంది, వైద్య పరికరాలు, భవనాలు, సదుపాయాలు లేవని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ మెడికల్ కళాశాలలో అంతర్గత రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, సూపర్‌స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్స్ కోసం సవరించిన గౌరవ వేతనం ఇవ్వాలని, తమ డిమాండ్లను పరిష్కరించుకుంటే ఈ నెల 24 నుంచి అత్యవసర సేవలు మినహా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తామని జూడాలు హెచ్చరించారు.



నర్సంపేట రూరల్ : యోగా చేస్తున్న ఇటుకాలపల్లి హైస్కూల్ విద్యార్థులు

## యోగా.. ఉత్సాహంగా

*ఆసనాలు, ప్రదర్శనలతో యోగా డేలో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి రోజూ యోగా సాధన చేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అవగాహన కల్పిస్తూ ఇటు పాఠశాలల్లో, మైదానాలతో పాటు పని ప్రదేశాల్లోనూ విద్యార్థులు, పెద్దలతో ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా పలు చోట్ల చిన్నారులు యోగా అక్షరక్రమంలో ప్రదర్శించిన ఆసనాలు ఆకట్టుకున్నాయి.*

*– నమస్తే నెట్‌వర్క్, జూన్ 21*



యోగా చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



దామెరలో యోగాసనాలు వేస్తున్న ఉపాధి కూలీలు